తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం
30 జనవరి 2026
పేజీలు : 8
Follow :

## గుడిపల్లి గ్రామ అభివృద్ధికి పాటుపడుతా

### గుడిపల్లి గ్రామ వాసి డాక్టర్ సముద్రాల రాములు

**పి.ఏ.పల్లి/గుడిపల్లి,జనవరి 29,(జనంసాక్షి)** గుడిపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో డాక్టర్ సముద్రాల రాములు వారి సతీమణి డాక్టర్ సుశీలమ్మ దంపతుల ను గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మరియు వారి పాలకవర్గం ఘనంగా సన్మానించారు.డాక్టర్ రాములు గుడిపల్లి గ్రామంలో గుడిపల్లి స్కూల్లో విద్య అభ్యసించి అంచలంచలుగా ఎదుగుతూ 1976 ఇండియా నుండి అమెరికాలో స్థిరపడి పుట్టిన ఊరిలో సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ఊరి అభివృద్ధికి తోడ్పడుతున్నందున వారు ఇండియాకు విచ్చేసిన విషయం తెలుసుకొని హైదరాబాదులో వారిని కలిసి మర్యాదపూర్వకంగా గ్రామ సర్పంచ్ కోరగా వారు గ్రామానికి విచ్చేసి నందున వారికి ఘనంగా సన్మానం చేశారు.గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ రాములు ను బొడ్రాయి ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే వారు స్పందిస్తూ వేపిస్తా అని అన్నారు.అదేవిధంగా గుడిపల్లి హైస్కూల్లో బాత్రూం లేక విద్యార్థిని,విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలపగా 5 లక్షల రూపాయలు వారి సొంతంగా ఏర్పాటు చేస్తా అని చెప్పడం జరిగింది.గుడిపల్లి హైస్కూల్లో తేర ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన 10 కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నాయని తెలుపగా కంప్యూటర్ కోచింగ్ ఇచ్చే వ్యక్తికి ప్రతి నెల జీతం చెల్లిస్తానని 20 వేల రూపాయలు కేటాయించినారు.అదేవిధంగా ఆసుపత్రిని సందర్శించి ఆస్పత్రికి విచ్చేసి ప్రజలు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా ఎంపీడీవో అండాలు,డిప్యూటీ తహసిల్దార్ విజయలక్ష్మి,ఎంఈఓ సముద్రాల శ్రీనయ్య, డాక్టర్ ప్రియాంక,వెటర్నరీ డాక్టర్ మల్లీశ్వరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, అంగన్వాడి టీచర్ అలివేలు, జయంతి,సింగరాజుపల్లి సర్పంచ్ శ్రీను,గుడిపల్లి ఉపసర్పంచ్ అర్వపల్లి శ్రీనయ్య, గుడిపల్లి పంచాయతీ కార్యవర్గ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గుడిపల్లి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో రాములు - సుశీలమ్మ దంపతులకు ఘనంగా సన్మానం



## వార్డు ప్రజలకు అండగా ఉంటాం ఆశీర్వదించి గెలిపించాలి

**సూర్యాపేట (జనంసాక్షి):** వార్డు ప్రజలకు అండగా ఉంటాం ఆశీర్వదించి గెలిపించాలని సూర్యాపేట మున్సిపాలిటీ 45వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గండూరి పావని కృపాకర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు.వార్డు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి హయాంలో సూర్యాపేట పట్టణంతో పాటు తమ వార్డు ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు.మూడో పర్యాయం కూడ అత్యధిక మెజారిటీతో గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని వార్డు ప్రజలను కోరారు.గత రెండు పర్యాయాలు వార్డు ప్రజలు తమను ఆదరించి గెలిపించి నందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సారి కూడా తమను ఆశీర్వదించి వార్డును మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వార్డుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తాం : డాక్టర్ రామ్మూర్తి యాదవ్

**సూర్యాపేట(జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటీ 33వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాను నామినేషన్ దాఖలు చేసినట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ తెలిపారు.46వ వార్డులో అడ్వకేట్ వూర గాయత్రి పోటీ చేస్తున్నట్లు చెప్పారు.గురువారం మున్సిపల్ కార్యాలయంలో డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్,గాయత్రి దంపతులు కౌన్సిలర్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను కౌన్సిలర్లుగా గెలిపిస్తే రెండు వార్డుల ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందజేస్తానని అన్నారు.మహిళలకు గర్భసంచి క్యాన్సర్ రాకుండా ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తామని చెప్పారు.రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యము కల్పిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా రేషన్ కార్డుల పంపిణీ , పేదలందరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీని తరపున పోటి చేస్తున్న తమను ఆదరించాలని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



## హాలియాలో మున్సిపల్ ఎన్నికల సందడి

### 7వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా చింతల చంద్రారెడ్డి నామినేషన్ దాఖలు

**హాలియా, జనవరి 29 జనంసాక్షి:** హాలియా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఎన్నికల సందడి నెలకొంది. 7వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా చింతల చంద్రారెడ్డి గురువారం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణకు శుక్రవారంతో గడువు ముగియనున్న నేపథ్యంలో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రానికి తరలివస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఇంకా అభ్యర్థుల పూర్తి జాబితాను ప్రకటించకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. అభ్యర్థిత్వానికి సంబంధించిన ధ్రువపత్రాల కోసం నేతలు పార్టీ అధిష్టానం చుట్టూ తిరుగుతున్నారు.






### అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికలకు

## కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

### నామినేషన్ సెంటర్లను పరిశీలించిన పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్



**అశ్వారావుపేట జనవరి 29,(జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్లను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ సెంటర్ల పరిసర ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు, రూట్ మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు, మెటల్ డిటెక్టర్ల వినియోగం వంటి అంశాలపై డీఎస్పీ అధికారులతో సమీక్షించారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎలాంటి గందరగోళం, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ మాట్లాడుతూ, అశ్వారావుపేట మున్సిపాలిటీలో జరగనున్న ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.నామినేషన్ సమయంలో అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని, గుంపులుగా చేరి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని హెచ్చరించారు. అనుమతి లేకుండా ర్యాలీలు, నినాదాలు, శబ్ద కాలుష్యం సృష్టించే చర్యలను సహించబోమని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టంగా తెలిపారు.ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీస్ శాఖకు సహకరించి ఎన్నికల నిర్వహణను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక సీఐల నాగరాజు రెడ్డి, ఎస్సైలు యాయంతి రాజు, అఖిల, ఇతర పోలీస్ అధికారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి

# గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటు

## జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకుంట్ల బాబురావు



**భువనగిరి, జనవరి 29(జనంసాక్షి)**

హెచ్ ఎం డి ఎ నుండి 56 కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చిన ఘనతభువనగిరి శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డిదని సర్పంచులుగా గెలిచిన నెల రోజులకే డబ్బుల వసూల్ల కోసం పాకులాడుతున్న టిఆర్ఎస్ సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేక మాకు చెప్పి చేయాలి అనడం చాలా సిగ్గు చేటు అయిన విషయం. సర్పంచ్ ఎలక్షన్ల నోటిఫికేషన్ కంటే ముందే భువనగిరి మండలంలోని అన్ని గ్రామాలకు హెచ్ఎండిఏ నిధులు కేటాయించి శంకుస్థాపన చేయడం జరిగింది. ఆ విషయం ప్రతి గ్రామంలోని వివిధ పార్టీల నాయకులకు ప్రజలకు తెలిసిన విషయమే. నిన్న టిఆర్ఎస్ సర్పంచుల ఫోరం ప్రెస్ మీట్ లో మాట్లాడడం చాలా ఆశ్చర్యకరం. అక్కడ కూర్చున్న సర్పంచుల దాంట్లో ఆయ ఊర్ల ల లో సర్పంచులు తెలియలేని పరిస్థితి ఊర్లలో సర్పంచులు భార్యలైతే ప్రెస్ ముందట వాళ్ళ భర్తలు సర్పంచ్లు హెచ్ఎండిఏ నామ్స్ ఏందో తెలుసుకొని మాట్లాడితే చాలా బాగుంటుందిఆయా గ్రామాల్లో ప్రత్యేక పాలన అధికారులను సంప్రదించి ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ నుంచి ఎక్కడికి సీసీ రోడ్లు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు అవసరమో అక్కడ కొలతలు వేసి లొకేషన్ల ఇవ్వడం జరిగింది. సర్పంచులుగా గెలిచిన వ్యక్తులు రెండు నెలల క్రితం హెచ్ఎండిఏ నిధుల ద్వారా గ్రామాల్లో పనులు జరుగుతుంటే గుర్తుకురాని సమస్యలు గెలిచిన నెల రోజులకే గుర్తుకొస్తున్నాయంటే కమిషన్ల కోసమే తప్ప అది గ్రామ అభివృద్ధి కోసం అని కాదు అన్న విషయం తెలుసుకోవాలి. మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి పది సంవత్సరాలలో భువనగిరి నియోజకవర్గానికి ఎన్ని హెచ్ఎండిఏ నిధులు తెచ్చాడో మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. గడిచిన రెండు సంవత్సరాలలోనే భువనగిరి నియోజకవర్గానికి అత్యధికంగా హెచ్ఎండిఏ నిధుల తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధికి పాల్పడుతున్న ఘనత భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిదని హెచ్ఎండిఏ షరతులు తెలేసుకోకుండా కొన్ని గ్రామాలలోని టిఆర్ఎస్ సర్పంచులు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు ఫోన్లు చేసి బెదిరించడం ఆయా ఊర్లలలో జరిగే అభివృద్ధిని అడ్డుకోవడమే ఎవరి సొంత లాభం కోసం ఫోన్లు చేసి కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారో అక్కడ కూర్చున్న వారు చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు.



# మెగా టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల

## జెడ్ పి హెచ్ ఎస్ గరిడేపల్లి విద్యార్థి మని బ్రహ్మాచారికి ప్రథమ బహుమతి

**నేరేడుచర్ల( జనంసాక్షి) :**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా టాలెంట్ టెస్ట్ ఫలితాలను గురువారం నాడు విడుదల చేసినట్లు ఇన్చార్జి ప్రిన్సిపల్ పి. వెంకటరమణ తెలిపారు. నేరేడుచర్ల గడేపల్లి పాలక వీడు మూడు మండలాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా గరిడేపల్లి జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థి మనీ బ్రహ్మాచారి 40 మార్కులకు గాని 36 మార్కులు సాధించి ఓవరాల్ టాపర్ నిలిచి మొదటి బహుమతికి ఎంపికయ్యాడు. అలాగే శ్రీవాణి పాఠశాలకు చెందిన ఏ లిఖిత సాయి 35 మార్కులు, పినాకిల్ పాఠశాల చెందిన అక్షిత 35 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇంకా జెడ్పిహెచ్ఎస్ నేరేడుచర్లకు చెందిన టి గోపీచంద్ కన్సోలేషన్ ప్రైజ్ ను సాధించారు. వీరితోపాటు ప్రతి పాఠశాల నుంచి ప్రథమ ద్వితీయ స్థానాల్లో విజేతలను ఎంపిక చేశారు. విజేతలందరికీ కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు.



# దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయండి

## క్యాలెండర్,డైరీ ఆవిష్కరణ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి పాండు

**భువనగిరి, జనవరి 29(జనంసాక్షి)**

భువనగిరిలోని సుందరయ్య భవనంలో భవనంలో తెలంగాణ భవన నిర్మాణ నిర్మాణ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి పాండు,గొరిగి సోములు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం హక్కులను తుంగలో తొక్కుతూ కార్మిక వర్గాన్ని పెట్టి చాకిరి చేయించుకుంటుందని అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను దేశంలో ఉన్న కార్పొరేట్ శక్తులకు అంబానీలకు అప్పజెప్పి వారి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నదని కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా పోరాడే పోరాటాలు చేసే హక్కు గాని సంఘం పెట్టుకునే హక్కు గాని యూనియన్ పెట్టుకునే హక్కు గాని లేకుండా చేస్తూ లేకుండా చేస్తుందని భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న వలస కార్మికుల చట్టం వెల్ఫేర్ బోర్డును లేకుండా చూస్తున్నదని ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ,జిల్లా కమిటీ సభ్యులు మాతయ్య, భవనిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రాధార మల్లేశం, నాయకులు వెంకటేశం, ఈశ్వరయ్య, మారయ్య, రాధాకృష్ణ, ఎల్ల స్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసినప్పుడే వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని శ్రీక్రాంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుంటోజు ఆంజనేయులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా పర్యావరణ కాలుష్యం పరిష్కార మార్గాలు అనే చిత్రలేఖనం పోటీలో స్థానిక శ్రీక్రాంతి జూనియర్ కళాశాలలో చదువుతున్న నర్ర శ్రావణి (బైపీసీ ప్రథమ సంవత్సరం) అనే విద్యార్థిని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ చాటిన విద్యార్థినిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో శ్రీక్రాంతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుండిగళ్ళ అశోక్, ఏవో యర్రమాద గోవర్ధన్ రెడ్డి, లిఖిత, చిన్నానాయక్, శేఖర్, నరేంద్రచారి, నాగయ్య, బచ్చయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**జనంసాక్షి, కొండమల్లేపల్లి**

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్ష సాధింపే

## బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ

**చౌటుప్పల్ జనవరి 29 (జనం సాక్షి)**



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్ నోటీసులు పంపడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమేనని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ ఆరోపించారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వానికి తనదైన ఇంటలిజెన్స్ వ్యవస్థ ఉంటుందని, అది ప్రభుత్వం కోసం పనిచేయడం సహజమని ఉప్పు కృష్ణ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఆ వ్యవస్థ కేవలం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల కోసమే పనిచేసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అభూత కల్పనలు సృష్టిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చేస్తోన్న ఈ దుష్ప్రచారాన్ని తెలంగాణ సమాజం ఎంతమాత్రం సహించదన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చారని పేర్కొన్నారు. నేటికీ ప్రజలు కేసీఆర్ పాలనను, ఆ అద్భుత ఫలితాలను గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రాజకీయ కక్షతో కేసీఆర్ కుటుంబాన్ని అభాసుపాలు చేయాలని చూడటం మానుకోవాలని తెలిపారు ఈ కేసు.. ఆ కేసు అంటూ నోటీసులు పంపడం వల్ల సాధించేదేమీ లేదని అధికారం ఎవరికీ శాశ్వతం కాద అని ఆయన హెచ్చరించారు. పనికిరాని కార్యక్రమాలు కట్టిపెట్టి, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. కేసీఆర్ పై ఇలాంటి కుట్ర రాజకీయాలు కొనసాగిస్తే తెలంగాణ గడ్డపై మరొక ఉద్యమం తలెత్తుతుందని ఆయన హెచ్చరించారు. సిట్ నోటీసుల వెనుక ఉన్న రాజకీయ కుట్ర కోణాన్ని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని సూచించారు.

# వైభవంగా కొనసాగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర

## ఉత్సవ భరితంగా కొనసాగుతున్న మహిళా కోలాటాలు

## అమ్మవార్లను ధరించుకుంటున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు

పెన్ పహాడ్, జనవరి 29 (జనంసాక్షి) ;

మండలపరిధిలోని గాజుల మల్కాపురం గ్రామ సమీపంలో కొండల నడుమ కొలువుదీరిన సమక్క-సారలమ్మ జాతర రెండో రోజు గురువారం ఉమ్మడి నల్గొండ జిల్లా నాలుగు మూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లను దర్శించుకొని నిలువెత్తు బంగారం,పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వహకులు జాతర సందర్భంగా రాష్ట్ర స్థాయి మహిళా కోలాటం పోటీలను ప్రారంబించారు.ఈ పోటీలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఆలయం వద్దకు వచ్చే భక్తులకు దేవి రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెన్ పహాడ్ సర్పంచ్ ఒగ్గు రవి లు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ వారిని శాలువాలతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు.జాతర వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ గోపి కృష్ణ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ బండి మధుసూదన్ రెడ్డి సర్పంచ్ నాతల వెంకట్ రెడ్డి గుత్తి కొండ రాంరెడ్డి ,మాజీ సర్పంచ్ బండి ధనమ్మ, రామకృష్ణరెడ్డి, దేవిరెడ్డి వెంకట రెడ్డి , జానకి రాంరెడ్డి.ఉపసర్పంచ్ ఆంజనేయులు, బెల్లకొండ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**సూర్యాపేట(జనంసాక్షి):** విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి భాను నాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జీవివి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ వెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల 7వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటర్ విద్య అనేది ప్రతి విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేదని, అందుకే విద్యార్థులు బాగా చదివి జీవితంలో రాణించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు.పరీక్షల సమయం ముందుందని విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించి కళాశాలతో పాటు తల్లిదండ్రులకు పేరు తేవాలని అన్నారు.కళాశాల కరస్పాండెంట్ కారింగుల బాలగౌడ్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తమ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు.తమ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి నేడు ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. తమ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు చేసిన విద్యార్థులు ఏ రంగంలోనైనా ఎక్కడైనా రాణించగలరని, అందుకు తమ పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలే నిదర్శనం అన్నారు.పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని వారి పిల్లలను అభివృద్ధిలోకి తేవాలనే సదాశయంతో తాము, కళాశాల అధ్యాపక బృందం



విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన ముగ్గురు విద్యార్థులు కె.వంశవర్ధిని ఎంపీహెచ్ డబ్ల్యూ 988 మార్కులు, కారింగుల సౌజన్య ఎమ్మెల్టీ ద్వితీయ సంవత్సరం 981, జి.హాసిని ఎంపిహెచ్ డబ్ల్యూ ఫిమేల్ డబ్ల్యు ప్రథమ సంవత్సరంలో 494 మార్కులు సాధించగా రూ .10వేల చొప్పున మొత్తం 30 వేల రూపాయల పారితోషకంను డిఐఈఓ భాను నాయక్ చేతులమీదుగా అందజేశారు.విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## హాలియా మున్సిపాలిటీలో 40 నామినేషన్లు దాఖలు



**హాలియా, (జనంసాక్షి):** మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా రెండో రోజు హాలియా మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను గురువారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 40 నామినేషన్లను దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 19, బిఆర్ఎస్ నుంచి 13, బిజెపి నుంచి 2, బీఎస్పీ నుంచి ఒకటి ఇండిపెండెంట్ అభ్యర్థులు 5 మంది తమ నామినేషన్ల పత్రాలను అధికారులకు సమర్పించారు. అదేవిధంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ నామినేషన్ల ప్రక్రియను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు సలహాలను తెలియజేశారు.

## మాదిగల మహాసభను విజయవంతం చేయాలి

గోవింద్ నరేష్ మాదిగ



**చింతలపాలెం (జనంసాక్షి):**కర్ల రాజేష్ లాకప్ డెత్ కు కారకులైన పోలీసులపై, సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేడు చింతలపాలెం మండలంలోని ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న మాదిగల మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ అన్నారు.గురువారం సభ ఏర్పాటు చేయుటకు గాను స్థల పరిశీలన చేశారు.భారీ సంఖ్యలో ఆయా గ్రామాల ప్రజలు అనుబంధ సంఘాల నాయకులు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ,ఎంఎస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న,ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు, ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు గొల్లపూడి రాకేష్ కుమార్, హుజుర్నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ బచ్చలకూరి ప్రసాద్,జిల్లా నాయకులు బాల చంద్రుడు,చిలక యేసు, మండల నాయకులు రామారావు,గోపి పాల్గొన్నారు.

## నామినేషన్లపై కలెక్టర్ క్షేత్రస్థాయి తనిఖీ

### నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**భూదాన్ పోచంపల్లి, (జనంసాక్షి):** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హనుమంత రావు అధికారులను ఆదేశించారు. గురువారం పోచంపల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న రెండో రోజు నామినేషన్ల ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వార్డు స్థానాలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల వివరాలను తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో ఏర్పాట్లు, హెల్ప్‌డెస్క్‌లను పరిశీలించిన కలెక్టర్, నామినేషన్ పత్రాలు, సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. నామినేషన్ల సమయంలో అవసరమైన ధృవపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, ఎన్నికల నివేదికలను టీ పోల్ యాప్‌లో క్రమం తప్పకుండా అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, మజీద్, దామోదర్ రెడ్డి, ఎస్ఐ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ నిర్మల, సీనియర్ అసిస్టెంట్ రాజేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడలు ప్రారంభం



**నూతనకల్ జనవరి 29 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గురువారం తుంగతుర్తి ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, మండల అధికారులు మరియు సర్పంచుల తో కలిసి మండల స్థాయిలో జరిగే సీఎం కప్ 2026 క్రీడలను ప్రారంభించడం జరిగింది ఆయన మాట్లాడుతూ క్రీడలు అనేవి శారీరక మానసిక ఎదుగుదలకు ఎంతో అవసరమని అన్నారు ఎంపీడీవో సునీత మాట్లాడుతూ కబడ్డీ, కోకో వాలీబాల్ ,అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నాం అని, అన్ని పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు. ఈ సీఎం కప్ క్రీడలు చాలా ఉపయోగపడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాములు నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, ఎంపీఓ శశికళ, నూతనకల్ సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు గుగులోతు కృష్ణ నాయక్, అనంతుల శ్రీనివాస్ గౌడ్, జటంగి కృష్ణ యాదవ్, గాడుదుల లింగరాజు యాదవ్, పాండవుల లింగయ్య,, వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిష్పక్షపాతంగా 'జనంసాక్షి'వాస్తవ వార్తా కథనాలు

**మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్.**



**బూర్గంపహాడ్ (జనంసాక్షి):** స్వరాష్ట్ర సమరయోధ దినపత్రిక 'జనంసాక్షి' నిష్పక్షపాతంగా.. ఏ రాజకీయ పార్టీకి కొమ్ము కాయకుండా వాస్తవ వార్తా కథనాలను అందిస్తోందని సారపాక మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న పత్రిక జనంసాక్షి అని అన్నారు. 'జనంసాక్షి' దిన పత్రిక 2026 సంవత్సర క్యాలెండర్ ను గురువారం మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనంసాక్షి ఫలితాల అంచనాలు ఎప్పుడూ తప్పు కాలే దని, ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో నిర్వహించిన సర్వేలో జనంసాక్షి సర్వే ఫలితాలు మరోసారి రుజువు చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ చందు నాయక్ అనుచరులు, భద్రు నాయక్, బీసీ సంఘం నాయకులు దాసరి సాంబ తోపాటు పాత్రికేయులు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సమగ్రాభివృద్ధే లక్ష్యం

**సూర్యాపేట(జనంసాక్షి):** సూర్యాపేట మున్సిపాలిటీ 48వ వార్డు కౌన్సిలర్ గా పోటి చేస్తున్న తనను వార్డు ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలుగు వెంకన్న కోరారు.గురువారం 48వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వెలుగు వెంకన్న నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ ఆపద వచ్చినా తన వంతు సహాయం చేశానని చెప్పారు. కూరగాయల మార్కెట్ లో రైతులు, వ్యాపారులు తమ వ్యాపారాలను ప్రశాంతంగా చేసుకునేలా ఎల్లవేళలా సహకారం అందిస్తానని అన్నారు.వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి మరొకసారి కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ వార్డుకు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## పోచంపల్లి మున్సిపాలిటీలో రెండవ రోజు

## 16 నామినేషన్లు దాఖలు

**భూదాన్ పోచంపల్లి, జనవరి 29 (జనంసాక్షి):** మున్సిపాలిటీలో నామినేషన్ల స్వీకరణ రెండవ రోజున మొత్తం 16 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపల్ కమిషనర్, సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి తెలిపారు. మొత్తం 13 వార్డులకు గాను మొదటి వార్డు నుంచి 3, రెండవ వార్డు నుంచి 2, మూడవ వార్డు నుంచి 1, ఐదవ వార్డు నుంచి 2, ఆరో వార్డు నుంచి 2, ఎనిమిదవ వార్డు నుంచి 2, తొమ్మిదవ వార్డు నుంచి 1, పదవ వార్డు నుంచి 1, పన్నెండవ వార్డు నుంచి 1, పదమూడవ వార్డు నుంచి 1 నామినేషన్ పత్రాలు సమర్పించబడ్డాయని ఆయన వివరించారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 30వ తేదీతో ముగియనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, మజీద్, దామోదర్ రెడ్డి, ఎస్ఐ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ నిర్మల, సీనియర్ అసిస్టెంట్ రాజేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు 'బిగ్ షాక్'

- కాంగ్రెస్ గూటికి కోడి వెంకన్న దంపతులు!
- రాజన్న చొరవతో కలిసిన 'కోడి బ్రదర్స్'.. 15 ఏళ్ల వైరానికి శుభం కార్డు
- ఆసక్తికరమైన, భావోద్వేగభరితమైన సన్నివేశం



**చందూరు జనవరి 29 (జనంసాక్షి):** మునుగోడు నియోజకవర్గం చందూరు మున్సిపాలిటీ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాబోయే మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. చందూరులో బలమైన నేతగా సన్ ఫైన్ విద్యాసంస్థల చైర్మన్‌గా గుర్తింపు పొందిన మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న, ఆయన సతీమణి, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోడి సుష్మా వెంకన్న గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కోడి వెంకన్న దంపతులను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి సాదర స్వాగతం పలికారు. చందూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో పార్టీ బలోపేతంలో వీరి చేరిక కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ రాజకీయ చేరికలో ఒక ఆసక్తికరమైన, భావోద్వేగభరితమైన సన్నివేశం చోటుచేసుకుంది. రాజకీయ నాయకుడిగానే కాకుండా.. మనుషుల మధ్య బంధాలను కలిపే వ్యక్తిగా రాజగోపాల్ రెడ్డి తన ప్రత్యేకతను చాటుకున్నారు.గత 15 ఏళ్లుగా కోడి వెంకన్న మరియు వారి సోదరుడి (కోడి బ్రదర్స్) మధ్య తీవ్రమైన కుటుంబ, వ్యక్తిగత విభేదాలు ఉన్నాయి.ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తనదైన రాజకీయ చతురతతో, పెద్దరికం వహించి ఇద్దరినీ కూర్చోబెట్టి మాట్లాడారు.అన్నాదమ్ముల మధ్య ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి, వారిద్దరినీ కలిపారు. రాజన్న చొరవతో 15 ఏళ్ల తర్వాత కోడి బ్రదర్స్ ఒక్కటవ్వడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కుటుంబాలను కలిపిన నాయకుడిగా రాజగోపాల్ రెడ్డిపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. చందూరు మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కోడి వెంకన్న దంపతుల నిష్క్రమణ బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. విద్యాసంస్థల అధినేతగా మాజీ కౌన్సిలర్‌గా ప్రజల్లో మంచి పట్టున్న వెంకన్న కాంగ్రెస్‌లో చేరడంతో చందూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మరియు మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన సిఎంకప్ క్రీడాపోటీలు



**పెనుబల్లి, జనవరి 29 (జనంసాక్షి):** పెనుబల్లి మండలం వి ఎం బంజర్ హైస్కూల్ లో రెండు రోజులపాటు జరిగిన సీఎం కప్ ఆటల పోటీలు ముగిసాయి. ఆఖరి రోజైనా గురువారం మండల స్థాయిలోపలు క్రీడ అంశాల్లో జరిగిపోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీడీవో అన్నపూర్ణ,ఎం ఈ ఓ మోహన్ రావు,ఆర్డబ్ల్యూఎస్ ఇంచార్జ్ ఏఈ జయలక్ష్మి బహుమతులు అందజేశారు. గెలుపొందిన వారిలో సీనియర్ బాలుర వాలీబాల్ క్రీడ విభాగంలో లో ప్రథమ స్థానం అదవి మల్లెల, ద్వితీయ స్థానం లంకపల్లి,సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం తా ళ్లపెంట,ద్వితీయ స్థానం వి ఎం బంజర్, జూనియర్ బాలుర విభాగంలో ప్రథమ స్థానం వి ఎం బంజర్, ద్వితీయ స్థానం అదవి మల్లెల పాఠశాలల విద్యార్థులు సాధించారు. సీనియర్ బాలుర కబడ్డీ విభాగంలో లంకపల్లి ప్రథమ స్థానం, తాళ్లపెంట ద్వితీయ స్థానం, సాధించారు. అథ్లెటిక్స్ లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ వివి రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బండి రాము, అనంతలక్ష్మి,రవీంద్రబాబు, రాజకుమారి,నరసింహారావు, అచ్యుత్ కుమార్, శేషగిరి, కైసర్,షాహిద్ సుల్తానా, త్రివేణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు నవభారత్ సహకారం



**బూర్గంపహాడ్ జనవరి 29 (జనంసాక్షి) :** బూర్గంపహాడ్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షి యల్ బాలికల పాఠశాలలో మరుగుదొడ్ల ఏర్పాటుకు పాల్వంచ నవభారత్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అందించిన సహకారం అభినందనీయమని తహశీల్దార్ కేఆర్ కె ప్రసాద్ అన్నారు. గురువారం పాఠశాలలో ఆయన పాఠశాల హెచ్‌ఎం గీతాజ్యోతి తో కలిసి వాష్రూ మ్ము ప్రారం భించి అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో మాట్లాడారు. పాఠ శాల అభివృద్ధితో పాటు మౌలిక సదుపా యాల కల్పనలో నవభారత్ అందించిందన్నారు. అంతేకాకుండా ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలలు, పరికరాలు, విద్యార్థులకు కం ప్యూటర్ విద్య అందించేందుకు ఉపాధ్యాయులను నియమిం చారని, ఉచిత ట్యూషన్ ఏర్పాటుకు సైతం సహకరిం చారన్నారు. 39 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరుగుదొడ్ల లేక ఇబ్బందులు పడు తుంటే వాష్రూమ్స్ పాటు హ్యాండ్వాష్ సౌకర్యాలు కూడా కల్పించార న్నారు. భవిష్యత్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని నవభారత్ కంపెనీ ప్రతినిధుల ను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నవలిమి టెడ్ హె డ్సీఎస్ఆర్ సీహెచ్. శ్రీనివాసరావు, లైసెన్ ఆఫీసర్ ప్రసాద్, అసి స్టెంట్ మేనేజర్ కరుణాకర్, సీఎస్ఆర్ ఫ్యాకల్టీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

– ఎంపీడీవో జమలారెడ్డి



**బూర్గంపహాడ్ జనవరి 29 (జనంసాక్షి):** క్రీడలు మాన సిక ఉల్లాసాన్ని, శారీరిక దేహదారుఢ్యాన్ని పెంపొం దిస్తాయని ఎంపీడీవో జమలా రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సీఎం కప్ 2025-26లో భాగంగా ఏర్పాటు చేసిన మండలస్థాయి క్రీడ పోటీలను తహశీల్దార్ కేఆర్ కె ప్రసాద్, ఎస్సై మేడా ప్రసాద్, సర్పంచ్ మందా కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో క్రీడాకారుల్లో నైపుణ్యతను వెలికి తీసేలా ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 300 మందికి పైగా క్రీడాకారులు హాజరవ్వగా నాలుగు క్లస్టర్లను విభజించి అండర్ 18 వాలీబాల్, ఖోఖో, కబడ్డీ విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఖోఖో బాలికల విభాగంలో బూర్గంపహాడ్ ప్రథమ, సారపాక ద్వితీయ, బాలుర విభాగంలో పినపాక పట్టీనగర్ ప్రథమ, బూర్గంపహాడ్ ద్వితీయ, వాలీబాల్ బాలుర విభాగంలో బూర్గంపహాడ్ ప్రథమ, సారపాక ద్వితీయ, బాలికల విభాగంలో బూర్గంపహాడ్ ప్రథమ, మోరంపల్లిబ oజర్ ద్వితీయ, కబడ్డీ బాలికల విభాగంలో బూర్గంపహాడ్ ప్రథమ, తహశీల్దార్, సర్పంచ్‌ల సమక్షంలో మెమోంటో, షీల్డ్ అందజేశారు.

## యూరియా బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కలిగి ఉండాలి

వ్యవసాయ విస్తరణ అధికారులు,పల్లెపంగు జోష్న, సంతోష్,సాయిశ్రీజన



**తుంగతుర్తి జనవరి 29 (జనంసాక్షి):** యూరియా బుకింగ్ యాప్ పై రైతులు, పెస్టి సైడ్ యజమానులు అవగాహన కలిగి ఉండాలని తుంగతుర్తి వ్యవసాయ శాఖ సహాయ విస్తరణాధికారులు అన్నారు, గురువారం మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ షాపులు యజమానులతో పాటు రైతులకు యూరియా యాప్ బుకింగ్ విధానం పై అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా సరఫరా లో పారదర్శకత సౌలభ్యం కోసం ఈ యాప్ ఉపయోగపడుతుందని అన్నారు, రైతులు తమ ఫోన్ నంబర్ ఉపయోగించి యూరియాను బుకింగ్ చేసుకోవడంతో పాటు స్టాక్ వివరాలను తెలుసుకోవచ్చని అన్నారు. యూరియా బుక్ చేసిన తర్వాత రైతులు 24 గంటల లోపల తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమములో వ్యవసాయం విస్తరణ అధికారులు జోష్న, సంతోష్, సాయి సృజన తోపాటు రైతులు మరియు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కోడ్ ....పోలీసుల విస్తృత సోదాలు



**చందూరు జనవరి 29 (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చందూరు పట్టణంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసే క్రమంలో... అక్రమ నగదు మరియు మద్యం రవాణాను అరికట్టడానికి పోలీసులు తనిఖీలను తీవ్రతరం చేశారు.తనిఖీలలో భాగంగా చందూరు ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో.. పోలీసు బృందం నల్గొండ రోడ్డులో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తోంది. అనుమానాస్పదంగా ఉన్న ప్రతి వాహనాన్ని, వ్యక్తులను పోలీసులు విచారిస్తున్నారు.ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. నగదు రవాణాపై పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు.ఎవరైనా వ్యక్తులు సరైన పత్రాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదును వెంట తీసుకువెళ్లరాదు.ఒకవేళ రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లాల్సి వస్తే... దానికి సంబంధించిన సరైన ఆధారాలు (బ్యాంకు రశీదులు లేదా ఇతర పత్రాలు) తప్పనిసరిగా చూపించాలి. నిబంధనలు ఉల్లంఘించి ఆధారాలు లేకుండా భారీ మొత్తంలో నగదును తరలిస్తే ఆ నగదును తక్షణమే సీజ్ చేస్తామని ఎస్సై శివకుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రలోభాలకు అడ్డుకట్ట వేయడానికే ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా.. పారదర్శకంగా.. జరగడానికి ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు. తనిఖీల నేపథ్యంలో వాహనదారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాల సమయంలో అనవసరంగా భారీ నగదును తీసుకురావద్దని సూచించారు.

## ఘనంగా మేళ్లచెరువు మండల స్థాయి సీఎం కప్ క్రీడలు ప్రారంభం



**మేళ్లచెరువు (జనంసాక్షి):** ఈ రోజు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేళ్లచెరువు నందు సీఎం కప్ 2025 మండల స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. ఇట్టి క్రీడలను తాహసిల్దార్ రాజేందర్ రెడ్డి , ఎంపీడీవో ఖాజా అస్గర్ అలీ, గ్రామ సర్పంచ్ బచ్చు పద్మావతి , మండల విద్యాధికారి కె వెంకట రెడ్డి, గ్రామ ఈవో ఫరీద్ , నారపరెడ్డి గార్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యా యులు ఉపేందర్ రావు, నాగేశ్వరరావు, రంగారావు, స్థానిక పాఠశాల ఉపాధ్యా యినీ , ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో నాంపల్లి బిఆర్ఎస్ నాయకులు



హైదరాబాద్ లోని రాగన్న గూడా లో జరుగుతున్న మహా రుద్ర సహిత సహస్ర చండీ మహా యాగానికి నాంపల్లి మండలం లోని తుంగపహాడ్ సర్పంచ్ కదారి శ్రీశైలం యాదవ్, బి ఆర్ ఎస్ మండల ప్రచార కార్యదర్శి కోన్ రెడ్డి ఏడుకొండలు, బి ఆర్ ఎస్ మండల నాయకులు అలుగువెల్లి జైపాల్ రెడ్డి, సపవత్ సర్దార్ నాయక్ గార్లు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, అక్కడికి వచ్చిన భక్తులకి సేవలందించారు.

## లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి కి ఆహ్వానం



**నాంపల్లి (జనంసాక్షి):** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి మెల్లవాయి గ్రామ పరిధిలో జరిగే శ్రీ అందెబండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక ను అందించిన సర్పంచ్ బత్తుల వంశీ గారు. నాంపల్లి మండలంలోని మెల్లవాయి గ్రామ పంచాయతీ పరిధిలో ఫిబ్రవరి 4 బుధవారం నుండి ఫిబ్రవరి 6 వరకు జరిగే శ్రీ శ్రీ అందెబండ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రికను స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని కలిసి స్థానిక సర్పంచ్ బత్తుల వంశీ గారు , కాంగ్రెస్ మండల నాయకులు గజ్జల శివారెడ్డి గారు అందజేశారు. వీరితో పాటు ఉపసర్పంచ్ బొడ్డుపల్లి హరికృష్ణ, గాడిపర్తి రాంబాబు, నేరడిగొమ్ము వెంకట్, ఉన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ దేవత తృతీయ వార్షిక ఉత్సవాలు నేటి నుండి ప్రారంభం

**- కోరిన కోర్కెలు తీర్చే జగన్మాత రేణుక ఎల్లమ్మ తల్లి**

**- ఆలయ వ్యవస్థాపకులు సల్వాది ధనిష్ఠ సుశీల**

**కొండమల్లేపల్లి, (జనంసాక్షి):** కొండమల్లేపల్లి పట్టణంలో వెలసిన శ్రీ జగన్మాత రేణుక ఎల్లమ్మ తల్లి తృతీయ వార్షిక కళ్యాణ మహోత్సవాలు శుక్ర, శనివారాలలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరగనున్నాయి. రేణుక ఎల్లమ్మ దేవత తృతీయ వార్షికోత్సవాల సందర్భంగా అమ్మవారి దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో పాటు వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. భక్తుల ప్రగాఢ విశ్వాసం ప్రకారం కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తే కోరిన కోరికలు తీరుతాయి. పట్టణ కేంద్రంలో విరాజిల్లుతున్నటువంటి శ్రీ రేణుక ఎల్లమ్మ వారి తృతీయ వార్షిక కళ్యాణ మహోత్సవములు శుక్ర, శని రెండు రోజులు కళ్యాణ మహోత్సవము సధ్యస్కాల దీక్షతో శైవాగమోక్త ప్రకారముగా శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ చానగొండ శివ కిరణ్ శర్మ, అభిమళ్ల నరసింహచార్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనం గా నిర్వహించబడునని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవత ఆలయ వ్యవస్థాపకులు, నిర్మాణ దాత సల్వాది ధనిష్ట సుశీల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు శుక్రవారం ఉదయం 8 గంటలకు మంగళ వాయిద్యా సంఘోషణ గణపతి ప్రార్థన భూత బలయాగ శాల ప్రవేశం, విఘ్నేశ్వర పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన ప్రాశసం ఆలయ విగ్రహ మార్జనలు, ఋత్విక వర్ణణ, దీక్షాకంకణాధారణ, అఖండ దీపారాధన, అస్త్ర రాజార్చన, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 4:30 గంటలకు మృతం గ్రహణ, అంకురారోహణ, మహా మండప అవాహన, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర సహిత భగరాముఖ ఆవాహనములు, మహిళలచే సామూహిక కుంకుమార్చన, నవకల శార్చన, ద్వాదశ ఆలాపన, నీరాజన మంత్రపుష్పములు, రాజోపచారములు అనంతరం తీర్థ ప్రసాద వితరణ. జనవరి 31 శనివారం ఉదయం 8:30 గంటలకు గవ్యాంత పూజలు, అష్టోత్తర శతకలశావాహన, చండీ సప్తశతి రుద్రవాహనములు మహా పూర్ణాహుతి, అష్టోత్తర శతకలాభిషేకము, విశేషాలంకరణ మహాదర్శనం, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణము. మహాదాశీర్వచనం, పండిత సన్మానము అన్న



ప్రసాద వితరణ కలదు, సాయంత్రం 6 గంటలకు శ్రీ రేణుక జమదగ్ని మహర్షి స్వాముల దివ్య కళ్యాణ మహోత్సవము అంగరంగ వైభవోపేతంగా జరుపబడునున్నారు. ఆదివారం ఉదయం 4:30 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద పెద్దపట్టం, అగ్నిగుండ ప్రవేశం కలదని భక్తులు, శివభక్తులు పాల్గొనాలన్నారు. రెండు రోజులపాటు భక్తులకు మహాన్నదాన కార్యక్రమం ఉందన్నారు. కావున భక్తులందరు కూడ ఇట్టి మహోత్తరమైన కార్యక్రమంలో విశేషంగా పాల్గొని రేణుక అమ్మవారి అనుగ్రహాన్ని పొంది తరించవలసిందిగా ఆలయ వ్యవస్థాపకులు సల్వాది ధనిష్ట సుశీల తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఖాయం

## బిఆర్ఎస్ నాయకుడు అప్పిరెడ్డి



**నేరేడుచర్ల (జనంసాక్షి):** త్వరలో జరగనున్న నేరేడుచర్ల మున్సిపల్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని టిఆర్ఎస్ పార్టీ నాయకుడు దొండపాటి అప్పిరెడ్డి అన్నారు. గురువారం టిఆర్ఎస్ పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ఉన్న ప్రజా వ్యతిరేకతే టిఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని నేరేడు జిల్లా మున్సిపాలిటీలలో 15 వార్డులలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం అనంతరం పలు వార్డులలో నామినేషన్ వేసే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నామినేషన్ కేంద్రానికి తరలి వెళ్లారు.పలు వార్డులకు సంబంధించి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయ బాబు, మాజీ జెడ్పిటిసి అన్నపురెడ్డి నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు నాదేండ్ల శ్రీధర్, ఇంజమూరి రాములు, మాజీ గ్రంథాలయ కమిటీ చైర్మన్ మార్కండేయ, టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిత్తలూరు సైదులు, నాయకులు రాపోలు నవీన్, హుస్సేన్ పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో బీజేపీ 'నామినేషన్ల' జోరు

## భారీ ర్యాలీతో తరలివచ్చిన అభ్యర్థులు



**చౌటుప్పల్, జనవరి 29 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు జనసందోహం నడుమ తమ నామినేషన్లను దాఖలు చేశారు. 2వ వార్డు అభ్యర్థిగా పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, 3వ వార్డు అభ్యర్థిగా రమణ గోని దీపిక శంకరయ్య, 14వ వార్డు అభ్యర్థిగా మార్గం పూజ శివకృష్ణలు తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్ పత్రాలను సమర్పించారు. 3వ వార్డులోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నుంచి ఈ భారీ ర్యాలీ ప్రారంభమై సుమారు 500 మంది మహిళాలు , పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో చౌటుప్పల్ ప్రధాన వీధుల మీదుగా ర్యాలీతో స్థానిక రామాలయాన్ని సందర్శించి అభ్యర్థులు, ఆశీస్సులు తీసుకుని నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ తరపున వివిధ వార్డుల్లో పోటీ చేస్తున్న ఇతర అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమణ గోని శంకరయ్య, ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# జోరందుకున్న నామినేషన్ల పర్వం

**రెండో రోజు 29 నామినేషన్లు దాఖలు**



**చండూరు జనవరి 29 (జనంసాక్షి):** చండూరు మున్సిపాలిటీ ఎన్నికల సం దడి మొదలైంది.గురువారం నాటికి అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 10 వార్డులకు గాను ఇప్పటి వరకు 33 నామినేషన్లు దాఖల య్యాయి. ఇందులో కేవలం ఒక్కరోజే 29 నామినేషన్లు దాఖలు కావడం విశేషం.మున్సిపాలిటీలో ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొంది. గణాంకాలను పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ నుండి అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి.కాంగ్రెస్:15 నామినేషన్లు (అత్యధికం), బీజేపీ : 6 నామినేషన్లు, బీఆర్ఎస్ : 4 నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థులు: 5 నామినేషన్లు,బీఎస్పీ: 1 నామినేషన్లు, ఇతరులు: 2 నామినేషన్లు ఆప్ , సీపీఎం, ఎంఐఎం, టీడీపీ, వైసీపీ పార్టీల నుండి ఇప్పటివరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.అత్యధిక పోటీ: 4వ వార్డులో అత్యధికంగా 8 నామినేషన్లు దాఖలయ్యాయి. 3వ వార్డు మరియు 9వ వార్డులో కేవలం ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. వివరాలను చండూరు మున్సిపాలిటీ కమిషనర్ మరియు అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ ధృవీకరించారు. నేడు చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో నామినే షన్లు దాఖలు అయ్యే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో నామినేషన్ల ఉపసంహరణ జాబితా తర్వాతపోటీ ముఖచిత్రం పూర్తిగా స్పష్టమవనుంది.

# హాలియాలో ఘనంగా శివ వీరబ్రహ్మేంద్ర స్వామి 21వ వార్షిక కళ్యాణ వేడుకలు



**హాలియా, జనవరి 29 (జనంసాక్షి):** హాలియా పట్టణంలోని ఎడమ కాలువ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ గోవిందా మాంబ దేవి సమేత శ్రీమద్విరాట్ పోతులూరి శివ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 21వ వార్షిక కళ్యాణ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, సుప్రభాత సేవలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం మూలవిరాట్యులకు పంచసూక్త పారాయణంతో పంచామృత అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. బిందతీర్థం, ఎదురుకోళ్ల వంటి కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.అనంతరం ఆలయ అర్చకుడు గొట్టిముక్కుల నర్సమాచార్యుల ఆధ్వర్యంలో కళ్యాణ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ పురవీధుల్లో భారత కోలాటంతో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కమిటీ అధ్యక్షుడు చెన్నోజు మోహనాచారి, కాతోజు యల్లయ్యాచారి పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గాయకవాడ శివనారాయణ వాక్యానంతో భక్తులను ఉత్తేజపరిచారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# మహారుద్ర యాగంలో పాల్గొన్న మల్ రెడ్డి,కోమటిరెడ్డి

**నాంపల్లి (జనంసాక్షి):** ఈ రోజు నాంపల్లి మండల మాజీ రైతు బంధు సమితి అధ్యక్షుడు ఏడుదొడ్ల రవీందర్ రెడ్డి గారు హైదరాబాద్ లోని రాగన్నగూడా లో శ్రీ శ్రీ రేణుక రాజ రాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మెల్లూరు నవీన్ శర్మ గారి సమక్షంలో జరుగుతున్న మహా రుద్ర సహిత సహస్ర చండీ మహాయాగానికి హాజరైన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ,కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని సాదరంగా ఆహ్వానించి సంప్రదాయ దుస్తువులలో ఉన్న వారిని శివలింగ అభిషేకం,యాగశాల సందర్శన, అమ్మవారి దర్శనం, అనంతరం వేద పండితులచే ఆశీర్వచనం ఇప్పించి. శాలువాలతో, మెమెంటో సన్మానించారు. వీరితోపాటు గుమ్మకొండ విఠల్ రెడ్డి,కోన్ రెడ్డి ఏడుకొండలు, కడారి శ్రీశైలం, అలుగువెల్లి జైపాల్ రెడ్డి,సిలివేరు పెద్దయ్యా బ్రాహ్మణులు తదితరులు ఉన్నారు.



# రెండో రోజు నామినేషన్ల జోరు

- **జిల్లాలో రెండో రోజు 432 నామినేషన్ల దాఖలు**
- **ఐదు మున్సిపాలిటీలలో రెండు రోజుల్లో మొత్తం 456 నామినేషన్లు**





**సూర్యాపేట (జనంసాక్షి):** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామి నే షన్ల స్వీకరణ కొనసాగుతుంది. సూర్యా పేట జిల్లాలోని మొత్తం ఐదు మున్సిపాలిటీలలో మొదటి రోజు బుధవారం 24 నామినేషన్లు రాగా, రెండో రోజు గురువారం 432 నామినేషన్లు వచ్చాయి.రెండో రోజు సూర్యాపేట మున్సి పాలి టీలో 230 , కోదాడ మున్సిపాలిటీలో 49, నేరేడుచర్ల మున్సిపాలిటీలో 37, తిరుమలగిరి మున్సిపాలిటీలో 49, హుజూర్ నగర్ మున్సిపాలి టీలో 67 నామినేషన్లను సమర్పించారు. మొత్తంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో రెండో రోజుల్లో 456 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఎస్పీ పార్టీ తరుపున 3, బీజేపీ నుండి 58, సీపీఎం నుండి 7, కాంగ్రెస్ నుండి 166, ఏఐఎంఐఎం నుండి 2, బీఆర్ఎస్ నుండి 136, టిడిపి నుండి 7,ఇతర గుర్తింపు పార్టీల నుండి 19, ఇండిపెండెంట్ అభ్యర్థులు 58 నామినేషన్లు దాఖలు చేశారు.మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.





# టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఫోరం టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

## ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం




**ఖమ్మం, (జనంసాక్షి):** టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ సూపరిడెంట్ ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌లో ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా పబ్లిక్ హాలిడేస్ మరియు ఆప్షనల్ హాలిడేస్ వివరాలను పొందుపరచడం పట్ల అధికారులు ఫోరం నాయకత్వాన్ని అభినందించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవోస్ ఎల్లప్పుడూ ముందుంటుందని, యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. పెండింగ్ సమస్యలు: రాష్ట్ర నాయకత్వం నిరంతరం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందని, త్వరలోనే ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఖఖీఅ మరియు ఇఊూ (హెల్త్ కార్డుల) సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే సానుకూల నిర్ణయాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ కార్యదర్శి జైపాల్, మెడికల్ అండ్ హెల్త్ ఫోరం అధ్యక్షులు సైదులు, సెక్రటరీ లావణ్య మరియు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆడపిల్లలు జన్మించినా, వివాహమైనా రూ. 2,016 నగదు అందజేస్తున్న గ్రామ సర్పంచ్ రామావత్ సేవ నాయక్. కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుర్రపుతండ గ్రామపంచాయతీ సర్పంచ్ రామావత్ సేవ నాయక్ అందజేస్తున్న సేవా నాయక్ బంగారు తల్లి కానుక విశేషంగా కొనసాగుతోంది. దర్గా తండా గ్రామానికి చెందిన మధు స్వాతి దంపతుల కూతురుకు గురువారం రూ. 2016 నగదును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆడబిడ్డలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామావత్ కమిలి, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి, కొండమల్లేపల్లి.

# 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలి

**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ ఫిబ్రవరి 2న గ్రామీణ స్థాయి నిరసనలను జయప్రదం చేయండి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపు**



**భువనగిరి, జనవరి 29 (జనంసాక్షి)** ఫిబ్రవరి 2న ఉపాధి హామీ ఫౌండేషన్ డే సందర్భంగా ( ఉపాధి హామీ చట్టం మొదట అమలైన రోజున) మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ గ్రామీణ స్థాయిలో నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా ఒక ప్రకటన ద్వారా తెలియజేసినారు. 2005 గ్రామీణ పేదల కోసం తీసుకొచ్చిన మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు జీవనాధారంగా ఉపయోగపడింది అన్నారు. 2005లో అమలులోకి వచ్చిన ఉపాధి హామీ చట్టం ద్వారా గత 15 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా రూ. 9.98 లక్షల కోట్లు ఖర్చు చేసి 4700 కోట్ల పనిదినాలు కల్పించబడ్డాయని తెలిపారు. కోట్లాది గ్రామీణ పేదలకు ఇది జీవించే హక్కు, బతికే ఆధారం, బేరం ఆడే శక్తి కల్పించిందని చెప్పారు. కానీ కార్పొరేట్ శక్తుల కోసం మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన 2025 జి రామ్ జి కొత్త చట్టం పేదల బతుకులపై ప్రాణాంతకమైన దాడి తెచ్చారని అన్నారు. కొత్త చట్టం 125 రోజులు పని అంటోందిని ఇది పచ్చి బూటకమని విమర్శించారు. ఈ కొత్త చట్టంలో కార్మికులకు హక్కులు లేవుని, హామీ లేదని, భద్రత కూడా లేదుని ఆవేదన వెలిబుచ్చారు. ఉపాధి హామీ స్థానంలో కార్పొరేట్ల లాభాల పథకం పెట్టారని అన్నారు. పాత చట్టం ప్రజలకు ఉపయోగపడితే, కొత్త చట్టం గ్రామీణ ధనిక వర్గాలకు ఉపయోగపడే విధంగా తీసుకొచ్చారని అన్నారు. పాత చట్టం రైతులకు ఉపయోగ పడిందని, గ్రామీణ అభివృద్ధికి, పేదల కొనుగోలు శక్తి, మహిళలకు భద్రత, సామాజిక న్యాయానికి అండ ఉన్నదని అన్నారు. 2025 మోదీ తీసుకొచ్చిన చట్టం గ్రామీణ పేదలకు నష్టం కలిగించిందని, మహిళల భద్రతపై దాడిని, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలపై దాడిని, ఇది మొత్తం గ్రామీణ సమాజంపై జరిగిన దాడిని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మోడీ తెచ్చిన కొత్త ఉపాధి చట్టం రద్దు చేసి 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలి కోరుతూ ఫిబ్రవరి 2న దేశవ్యాప్తంగా గ్రామీణ స్థాయిలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలలో గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలు, సన్నా చిన్న కారు రైతాంగం, పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ పిలుపునిచ్చారు.

# ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

## కార్మిక సంఘాల పిలుపు



**తుంగతుర్తి జనవరి 29 (జనంసాక్షి)** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజా రామ్ పిలుపు ఇచ్చారు, గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్మిక సంఘ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రమశక్తి నీతి పేరుతో దేశ కార్మిక వర్గ శ్రమశక్తిని కారు చౌకగా పెట్టుబడుదారులకు, కార్పొరేట్లకు మల్టీనేషన్ కంపెనీలు కొల్లగొట్టడా నికి మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రూపొందించారని ఇది కార్మిక వర్గానికి తీవ్ర వ్యతిరేకమైనవని అన్నారు, 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా కుదించి కార్మిక హక్కులను హరించే విధంగా మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అన్నారు. బిజెపి ప్రభుత్వానికి కొడులు తప్ప కార్మిక చట్టాలు ఇష్టం ఉండదని అన్నారు. లేబర్ కోడులలో రాసిన ప్రకటిత అంశాలు ఎలా ఉన్నా సారాంశంలో ఒక వర్గానికి మరో వర్గం కట్టుబడి ఉండాలని బిజెపి కోరుకుం టుందని ఇవే అంశాలు దీనిలో పొందుపరిచారని అన్నారు. కోడుల వలన కార్మికుల బతుకులు ఉజ్వలంగా ఉంటున్నాయని, ఆత్మ నిర్బర్ లో భాగంగా కొత్త హక్కులు కల్పిస్తున్నామని చెప్పడం పచ్చి బూటకమని, చట్టాల స్థానంలో కొడులు తేవడం అంటే కార్మికుల చేతులకు సంకెళ్లు వేయడమేనని అన్నారు. కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకోవడం యాజమాన్యాలతో బేర సారలు చేసుకోవడం, సమ్మె చేసుకునే హక్కు,పని గంటలు పెంచి కార్మిక వర్గం పై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15000 వేలు వేతనం పొందే కార్మికులు,కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికులు కార్మికులుగా గుర్తించబడరని అన్యాయం అన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల ను ఉద్యోగులుగా ట్రీట్ చేస్తూ కార్మిక చట్టాలు వీరికి వర్తించకుండా దూరం చేయనున్నారని విమర్శించారు. వేతనాల పెంపు యాజమాన్యాల దయాదాక్షణలపై ఆధార పడే విధంగా దీనిలో చేర్చారని దుయ్యబట్టారు. కార్మికులు ఎన్నో ఏళ్ల నుండి పోరాటం చేసి సాధించుకున్న హక్కులను ,చట్టాలను కాలరాస్తున్నారని లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు గొడ్డలి నరసయ్య, ఐఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు కోటా రామస్వామి, పాల్వాయి పున్నయ్య, మనోజ్, నరసయ్య, టి యు సి ఐ నాయకులు మామిడి సుధాకర్, గుండగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో ప్రైవేటు ఉపాధ్యాయుడు మృతి





**టేకులపల్లి,జనవరి 29(జనంసాక్షి):** టేకులపల్లి మండలంలోని సులానగర్ గ్రామానికి చెందిన బల్లెం బిక్షం(52) ప్రైవేటు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఇటీవల కొద్ది రోజుల నుండి అస్వస్థతకు గురై కోలుకొని అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో హుటాహుటిన హైదరాబాదుకు తరలించి వైద్య చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. మృతుడు బిక్షం డిగ్రీ పూర్తి చేసుకొని, సులానగర్ గ్రామంలో ఆర్సిఎం సంస్థకు చెందిన కార్మెల్ మాత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయునిగా సుదీర్ఘంగా కొనసాగారు. పేద కుటుంబంలో జన్మించిన బిక్షం, ప్రైవేటు ఉపాధ్యాయునిగా వచ్చే అరకొర జీతంతో సాధారణమైన ఇంటిలో ఉంటూ, అష్ట కష్టాలు పడుతూ తన కూతురు, కుమారుడ్ని గొప్పగా చదివించాడు. మృదు స్వభావి కలిగిన బిక్షం గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలతో మమేకమై చేదోడు వాదోడుగా అందరికీ తన వంతు సహాయ సహకారాలు అందించేవాడు. అంతేకాకుండా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలంటే ఎంతో ఇష్టపడేవాడు. సులానగర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి ఏర్పాటు చేయడంలో తన కృషి ఎంతగానో ఉండేది. తెలంగాణ ఉద్యమ ప్రదాత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అంటే తనకు ఎంతో ఇష్టంగా భావించేవాడు. ఆ క్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా కొనసాగుతూ పార్టీకి తన వంతు కృషి చేసేవాడు. ఎందరో విద్యార్థులకు మంచిమాస్టారుగా గ్రామంలోని ప్రతి ఒక్కరికి మృదు స్వభావిగా మెలిగి, చివరకు భార్య పిల్లలకు సరైన గూడు కూడా నిర్మించుకోలేకపోయాడు. ఆ కుటుంబానికి అందరూ సహకరించాలని, బిఆర్ఎస్ పార్టీ పెద్దలు మరీ ముఖ్యంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బిక్షం మృతి కుటుంబ సభ్యులకే కాకుండా, సులానగర్ గ్రామానికి, బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, బేతంపూడి మాజీ సొసైటీ అధ్యక్షులు లక్కినేని సురేందర్ రావు, టిఆర్ఎస్ నాయకులు భూక్య దళిసింగ్ నాయక్, పార్టీ మండల అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్,సులానగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోతు లక్ష్మనాయక్ ఉప సర్పంచ్ ఉండేటి చెన్నయ్య,మాజీ ఉపసర్పంచ్ ఉండేటి బసవయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాలే ప్రసాదరావు, మండల టిఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, పాస్టర్లు బల్లెం బాబురావు తదితరులు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.